తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | మంగళవారం | 10 - 02 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 1


# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

- రెండు పార్టీల మధ్య హోరాహోరీ పోరు
- మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రెండు పార్టీలు
- గత ఎన్నికల్లో 7 వార్డుల్లో బీఆర్ఎస్, 5 వార్డుల్లో కాంగ్రెస్ గెలుపు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తులో కమ్యూనిస్టులు
- చైర్మన్ అభ్యర్థులను ప్రకటించని ఇరు పార్టీలు




## మోత్కూరు మున్సిపల్ ఫైట్

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య టఫ్ ఫైట్ నెలకొంది. ఇరు పార్టీలు మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేస్తున్నాయి. మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా, చైర్మన్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యింది. అధికార కాంగ్రెస్‌లో అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మధ్య వాగ్వివాదం జరగడంతో పాటు ఆశావహుల్లో, నాయకుల్లో అసంతృప్తి, అలకలు నెలకొన్నాయి. కొందరిని బుజ్జగించినా, కొన్ని వార్డుల్లో ఆ అసంతృప్తి అలానే కొనసాగుతుందని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో మాత్రం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అంతా తానై పార్టీ కేడర్‌ను నడిపిస్తున్నారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్ రెడ్డిని మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిగా పెట్టగా ఆయన అందరినీ సమన్వయం చేస్తూ ఒక్కో వార్డులో ఇద్దరు, ముగ్గురు ముఖ్య నాయకులను ఇన్‌చార్జులుగా పెట్టారు. రెండు పార్టీలు ఎక్కడా తగ్గకుండా ప్రచారాన్ని హోరెత్తించాయి. అధికార కాంగ్రెస్ ఒక అడుగు ముందుకేసి మంత్రి సీతక్కతో ప్రచారం చేయించింది. మున్సిపాలిటీలో తాము తెచ్చిన రూ.20 కోట్ల నిధులతోనే ఇప్పటి వరకు డెవలప్‌మెంట్ పనులు జరిగాయని బలంగా ప్రచారం చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం, అధికార ఎమ్మెల్యే ఉన్నందున మున్సిపాలిటీలో కాంగ్రెస్ గెలిస్తేనే డెవలప్‌మెంట్ జరుగుతుందని ఆ పార్టీ ప్రచారం చేసింది. ఎన్నికల్లో కాంగ్రెస్ సీపీఐతో పొత్తు పెట్టుకుని 5వ వార్డు సీపీఐకి ఇవ్వగా, బీఆర్ఎస్ సీపీఎంతో కలిసి 8వ వార్డును ఆ పార్టీకి ఇచ్చింది. కాంగ్రెస్‌లోనే ఆశావహులు ఎంతో మంది ఉండగా ఎలాంటి బలం లేని సీపీఐతో పొత్తు పెట్టుకోవడమేమిటని, సీపీఐకి ఇచ్చిన ఆ వార్డులో కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు బలంగా ఉన్నారని, కాంగ్రెస్ నాయకులకు ఇవ్వకపోవడంతో అక్కడ తీవ్ర అంతర్యుద్ధం నెలకొంది. 8వ వార్డులో గతంలో పోటీ చేసి ఓడిన సీనియర్ నాయకుడు అవిశెట్టి అవిలిమల్లుకు ఇవ్వకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. 2వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి బోయినపల్లి లక్ష్మీ వార్డులో ముమ్మర ప్రచారం చేస్తుండగా ఆమె కాంగ్రెస్ ఓట్లను చీల్చే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ నాయకులను ఆమెను బుజ్జగించినట్టు తెలిసింది. 4వ వార్డు (కొండగడప)లో కాంగ్రెస్ రెబల్‌గా దొంతరబోయిన భారతమ్మ బరిలో ఉండగా అక్కడ కొంత ప్రభావం పడే అవకాశం ఉందంటున్నారు. 5వ వార్డు (బుజిలాపురం)లో  కాంగ్రెస్ రెబల్ మాజీ కౌన్సిలర్ మలిపెద్ది రజిత, స్వతంత్ర అభ్యర్థి మొగుళ్ల అనురాధ, బీఆర్ఎస్ అభ్యర్థి కోక రేణుకభిక్షం మధ్య పోటీ నెలకొంది. 12వ వార్డు జనరల్ స్థానం అయినా ఇక్కడి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎస్సీ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఆ ఇద్దరు అభ్యర్థులు చైర్మన్ రేసులో ఉన్నారని ఆ పార్టీల్లో ప్రచారం జరుగుతోంది. 12వ వార్డులో కాంగ్రెస్ రెబల్  మెంట జయమ్మ, స్వతంత్ర అభ్యర్థి కూరెళ్ల సువర్ణనర్సింహ ముమ్మర ప్రచారం చేస్తుండగా వారు ఎవరి ఓట్లను చీల్చుతారోనన్న ఆందోళన ఇరు పార్టీల్లో నెలకొంది. 12 వార్డుల్లో బీజేపీ పోటీ చేస్తున్నప్పటికీ ప్రజలు ఆ పార్టీని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఆ పార్టీ అభ్యర్థులు 8, 9 వార్డుల్లో కొన్ని ఓట్లను మాత్రం చీల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్ రెబల్స్, బీజేపీ అభ్యర్థులు ఓట్లు చీల్చితే తమకు మరింతగా కలిసి వస్తుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది.

## చైర్మన్ అభ్యర్థులను ప్రకటించని ఇరు పార్టీలు

చైర్మన్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ కాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇప్పటి వరకు చైర్మన్ అభ్యర్థులను ప్రకటించలేదు. ఎస్సీ మహిళ రిజర్వ్ అయిన 2వ, 6వ వార్డుతో పాటు జనరల్ స్థానమైన 12 వార్డులో కాంగ్రెస్ ఎస్సీ మహిళను పోటీలో పెట్టింది. బీఆర్ఎస్ 2వ, 12వ వార్డులో మాత్రమే పోటీలో నిలబెట్టింది. అధికార కాంగ్రెస్‌లో మాత్రం 12వ వార్డులో పోటీలో ఉన్న మెంట రమణనగేష్ గెలిస్తే.. చైర్మన్ అని ప్రచారం జరుగుతోంది.  ఆ వార్డులో మాత్రం పోటీ రసవత్తరంగా జరుగుతోందని ఇరు పార్టీల కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్‌లో వైస్ చైర్మన్ రేసులో 1వ, 9వ వార్డుల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు వినిపిస్తున్నాయి.

## బీఆర్ఎస్ 8 వార్డుల్లో గెలిస్తేనే...

బీఆర్ఎస్ 8 వార్డుల్లో గెలిస్తేనే స్పష్టమైన మెజార్టీతో మున్సిపాలిటీని కైవసం చేసుకునే అవకాశముంది. 12 వార్డుల్లో 6 నుంచి 7 వార్డులను కైవసం చేసుకున్నా అధికార కాంగ్రెస్ నుంచి ఎక్స్ అఫిషియో ఓట్లతో (ఎమ్మెల్యే, ఎంపీ) అడ్డుకునే ఛాన్స్ ఉంటుంది. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొనగా బీఆర్ఎస్ 7, కాంగ్రెస్ 5 వార్డుల్లో విజయం సాధించాయి. ఫలితాల ప్రకటన సందర్భంగా 6 వార్డుల్లో బీఆర్ఎస్, 5 వార్డుల్లో కాంగ్రెస్ గెలుపొందగా ఒక వార్డు టై కాగా అందరిలో ఉత్కంఠ నెలకొంది. టాస్‌లో ఆ వార్డు బీఆర్ఎస్ గెలువగా 7 వార్డులను గెలుచుకుని బీఆర్ఎస్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ 6 వార్డుల్లో విజయం సాధించినా ఎక్స్ అఫిషియో ఓట్లతో మున్సిపాలిటీని చేజిక్కించుకుంటుంది. పోలింగ్‌కు ఒక్కరోజే సమయం ఉండటంతో ఇరు పార్టీలు పోల్ మేనేజ్‌మెంట్ పై ఫోకస్ పెట్టాయి. గత ఫలితాలు రిపీట్ అవుతాయా లేక వార్ వన్‌సైడ్ అవుతుంతా అన్న చర్చ జరుగుతోంది. మోత్కూరు మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత రెండోసారి జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాలి.